## వచ్చే రెండ్రోజులు భారీ వర్షాలు

- పలు జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక

హైదరాబాద్, మే 16 (నమస్తే తెలంగాణ): ఉత్తర, దక్షిణ ద్రోణి ప్రభావంతోపాటు, ఆగ్నేయ బంగాళాఖాతం దాని పరిసరాల్లో సముద్రమట్టానికి 3.1 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల చక్రవాక ఆవర్తనం ఏర్పడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రెండ్రోజులపాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొన్నది. దీంతో ఆయా జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కోరింది. శుక్రవారం నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ-గద్వాల, జగిత్యాల, రాజన్న-సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వర్షం కురిసినట్టు వెల్లడించింది. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో అత్యధికంగా 8.8 సెం.మీ నమోదైనట్టు వివరించింది. శుక్రవారం 19జిల్లాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదుతో ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

## రాష్ట్రంలో తగ్గిన పశుసంపద

- 38 శాతం తగ్గిన నాటుకోళ్లు
- 21వ జాతీయ పశుగణన వెల్లడి

హైదరాబాద్, మే 16 (నమస్తేతెలంగాణ): తెలంగాణలో పశుసంపద తగ్గింది. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు తగ్గాయి. నాటుకోళ్ల సంఖ్య కూడా గణనీయంగా తగ్గుతున్నది. కేంద్రం నిర్వహించిన 21వ జాతీయ పశుగణనలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. 2019లో జరిగిన 20వ పశుగణనతో పోలిస్తే తెలంగాణలో పశుసంపద తగ్గినట్టు తేలింది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2014లో పశుగణన జరిగింది. తర్వాత 2019లో చేపట్టిన పశుగణన నాటికి 512.06 మిలియన్ల నుంచి 535.82 మిలియన్లకు పశువుల సంఖ్య పెరిగింది. ఈ సారి తగ్గుదలను అధికారులు గుర్తించారు.

**తగ్గుదల వివరాలు**

- ఆవులు సూర్యాపేటలో 62.65శాతం, సంగారెడ్డిలో 50.74, మెదక్‌లో 45.26, మహబూబాబాద్‌లో 43.64 శాతం చొప్పున తగ్గాయని అధికారులు గుర్తించారు.
- బర్రెలు సంగారెడ్డిలో 46.14 శాతం, కామారెడ్డిలో 45.92 శాతం, మెదక్‌లో 45.32 శాతం, మహబూబాబాద్‌లో 43.23 శాతం తగ్గాయి.
- గొర్రెలు మేడ్చల్-మల్కాజిగిరిలో 60.35 శాతం, పెద్దపల్లిలో 37.09, హైదరాబాద్‌లో 35.29, కరీంనగర్‌లో 30.89, మెదక్‌లో 30.06 శాతం చొప్పున తగ్గాయని అధికారులు గుర్తించారు.
- మేకలు హైదరాబాద్‌లో 40.87 శాతం, ములుగులో 32.52 శాతం, సంగారెడ్డిలో 29.76 శాతం, రంగారెడ్డిలో 25.83 శాతం తగ్గాయి.
- నాటుకోళ్లు 38 శాతం తగ్గిపోయాయి.

# యథేచ్ఛగా కల్తీ విత్తనాలు

మొదటిపేజీ తరువాయి...

మాట్లాడుతూ కల్తీ విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. 1966లో కేంద్రం చేసిన విత్తన చట్టం, 2007 పత్తి విత్తన చట్టాల్లో లోపాలున్నాయని 2004 నుంచి చర్చ జరుగుతున్నదని తెలిపారు. కాబట్టి రాష్ట్రానికి కొత్త విత్తన చట్టం అవసరమని పేర్కొన్నారు. ములుగు, భూపాలపల్లి, సూర్యాపేట నిజామాబాద్ ప్రాంతాల్లో నకిలీ మొక్కజొన్న, వరి, పత్తి విత్తనాల వల్ల వేల ఎకరాల్లో పంట నష్టపోయిన రైతులు రోడ్లెక్కి ఆందోళన చేశారు. రైతుల నుంచి వచ్చిన ఒత్తిడితో ఆ ప్రాంతాల్లో పర్యటించిన రైతు కమిషన్, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ప్రతినిధులు, అధికారులు నకిలీ విత్తనాల వల్లే రైతులు నష్టపోయారని గుర్తించారు. విత్తనం పండించుకోడానికి తెలంగాణ అనుకూలమైన ప్రాంతమని, అందుకే మల్టీనేషనల్ కంపెనీలు అన్ని రకాల విత్తనాలను ఇక్కడ తయారుచేస్తున్నాయని కమిషన్ సభ్యులు గుర్తించారు. నకిలీ విత్తనాల బారినపడి రైతులు మోసపోయిన ఘటన ఇటీవల ములుగులో వెలుగుచూసిందని రైతు కమిషన్ సభ్యులు తెలిపారు. రైతు కమిషన్ ములుగులో పర్యటించి కమిటీ వేసి నివేదిక తెప్పించినట్టు పేర్కొన్నారు. మొక్కజొన్న కంకి తింటే పశువులు చనిపోయాయని కమిషన్ పేర్కొన్నది. రైతులు, కూలీలు



తిని అనారోగ్యం పాలయ్యారని, ఒకరిద్దరు చనిపోయారని తెలిపారు. సింజెంటా కంపెనీ మోసాలు చాలా ఉన్నాయని, మార్కెట్ ఫీజు కూడా కట్టకుండా మినహాయింపు తెచ్చుకున్నారని కమిషన్ సభ్యులు పేర్కొన్నారు.

**నాణ్యమైన పసుపు విత్తనం అవసరం**

పసుపు పంటకు నిజామాబాద్ కేరాఫ్ అడ్రస్‌గా ఉన్నదని, అందుకనే కేంద్ర ప్రభుత్వం అక్కడ పసుపుబోర్డు ఏర్పాటు చేసిందని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తెలిపారు. అయినప్పటికీ రైతుకు న్యాయమైన ధర అందడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇక్కడ పండే పసుపులో కురుకుమిన్ శాతం తక్కువగా ఉన్నదని, అది ఎక్కువగా ఉండే విత్తనం అందుబాటులో లేకపోవడమే అందుకు కారణమని పేర్కొన్నారు. భూమిలో నుంచి పసుపు పీకడం, ఉడకబెట్టడం, పాలిష్ చేయడంలో యంత్రపరికరాలు అవసరమని తెలిపారు. వచ్చే సీజన్ నాటికైనా కేంద్రం ఆధునిక యంత్రాలు అందించే ప్రయత్నం చేయాలని కోరారు. కురుకుమిన్ శాతం ఎక్కువగా ఉండే విత్తనాన్ని అందించాలని రాష్ట్ర ఉద్యానవన శాఖకు కూడా సూచించినట్టు కోదండరెడ్డి తెలిపారు. కల్తీ విత్తనం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని కమిషన్ సభ్యురాలు భవానీరెడ్డి తెలిపారు. ములుగులో పర్యటించాక విత్తన చట్టం అవసరాన్ని గుర్తించినట్టు చెప్పారు. రైతులకు నాణ్యమైన విత్తనం అందడం లేదని వ్యవసాయ కమిషన్ సభ్యుడు భూమి సునీల్ చెప్పారు.

### నకిలీ విత్తనాలపై బీఆర్ఎస్ ఉక్కుపాదం

బీఆర్ఎస్ హయాంలో నకిలీ విత్తనాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. వానకాలానికి ముందే విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసి రైతులు నకిలీ విత్తనాల బారి నపడకుండా జాగ్రత్తలు తీసుకున్నది. నకిలీ విత్తనాలు విక్రయిస్తూ ఎవరైనా దొరికితే పీడీయాక్ట్ నమోదు చేసి జైళ్లకు పంపింది. దీంతో బీఆర్ఎస్ హయాంలో రైతులు హాయిగా పంటలు పడించుకున్నారు. ఎక్కడా నకిలీ అన్నమాటే వినిపించలేదు. ఈ విషయాన్ని రైతులు గుర్తుచేసుకుంటున్నారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నకిలీ విత్తనాల వ్యాపారులు చెలరేగిపోతున్నారు. ఎడాపెడా విత్తనాలు విక్రయిస్తూ సొమ్ము చేసుకుని రైతుల పొట్ట కొడుతున్నారు. స్వయంగా వ్యవసాయ కమిషనే ఈ విషయం చెప్పడం అందరినీ విస్మయపరుస్తున్నది. నకిలీ వ్యాపారులు విచ్చలవిడిగా విక్రయాలు సాగిస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.



నేలకొండపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

## నెల రోజులైనా ధాన్యం కొనరా?

- వెంటనే కాంటా పెట్టాలంటూ అన్నదాతల ఆందోళన
- ఖమ్మం జిల్లా నేలకొండపల్లి తహసీల్ ఎదుట బైఠాయింపు
- కొనుగోళ్లు త్వరితగతిన చేపట్టాలని రైతుల డిమాండ్

కూసుమంచి (నేలకొండపల్లి), మే 16 : తేమ శాతం వచ్చి నెల దాటినా ధాన్యం కొనుగోలు చేయకపోవడంపై రైతన్నలు భగ్గుమన్నారు. శుక్రవారం తెల్లవారుజామున కురిసిన వర్షంతో ఆరబెట్టిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు పడరానిపాట్లు పడ్డారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల తీరుతో విసిగిపోయిన అనాసాగరం రైతులు శుక్రవారం ఖమ్మం జిల్లా నేలకొండపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. వీరి ఆందోళనకు అన్ని పార్టీల వారు మద్దతు ప్రకటించారు. అనాసాగరంలో సుమారు 50 మంది రైతులు కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు పోసి అమ్మకానికి ఎదురు చూస్తున్నారు. అందులో కొందరు రైతులు పచ్చి ధాన్యం అమ్ముకోగా.. మిగిలిన రైతులు ప్రభుత్వం అందించే బోనస్ రూ.500 వస్తుందనే ఆశతో రాశులుగా పోశారు. కానీ.. మిల్లర్లు 1638 రకం ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో ఆలస్యమైంది. అంతేకాక ధాన్యం కాంటా వేయడానికి గన్నీ బ్యాగులు లేకపోవడం, కాంటా వేసిన ధాన్యం తరలించేందుకు లారీలు రాకపోవడం, ఇంకా 15 లారీలకుపైగా ధాన్యం కాంటా పెట్టాల్సి ఉండటం.. ఈలోగా శుక్రవారం వర్షం కురవడంతో రైతులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి రైతులతో మాట్లాడారు. గన్నీ బ్యాగులు వెంటనే పంపించి కాంటా వేయిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

# తరుగు దోపిడీపై మంత్రుల నిలదీత

### బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్ • రైతుల పక్షాన నిలబడితే కేసులా?: కేటీఆర్ ఫైర్

భైంసా/భైంసాటౌన్,/కుంటాల, మే, 16 : ధాన్యం కొనుగోళ్లలో తరుగు పేరిట రైతులను ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తున్నదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. శుక్రవారం నిర్మల్ జిల్లా కుంటాలలో భూభారతి రెవెన్యూ సదస్సుకు వచ్చిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ రాజ్ మంత్రి సీతక్కను బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ నాయకులు అడ్డుకోవడానికి యత్నించారు. పోలీసులు వారిని అరెస్టు చేసి నర్సాపూర్ (జీ) పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు కిరణ్ కొమ్రేవార్, జడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ మాట్లాడుతూ.. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో తాలు పేరిట క్వింటాల్‌కు 5



నిర్మల్ జిల్లా కుంటాలలో మంత్రులను అడ్డుకుంటున్న జడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

కిలోలు కోత విధించడం అన్యాయమని అన్నారు. రైతులను ఇబ్బంది పెడితే ఊరుకోబోమని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుబంధు బందైపోయిందని విమర్శించారు. కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**కేసులకు భయపడొద్దు : కేటీఆర్**

అరెస్టయిన బీఆర్ఎస్ నాయకులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫోన్‌లో మాట్లాడారు. ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయ సమితి సభ్యుడు విలాస్ గాదేవార్‌తో ఫోన్‌లో మాట్లాడిన కేటీఆర్ అక్కడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రైతుల పక్షాన పోరాడుతున్నందుకు ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా భయపడొద్దని సూచించారు. మరిన్ని పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పోలీస్‌స్టేషన్ నుంచి 2 గంటల్లో విడుదల చేయకపోతే బీఆర్ఎస్ లీగల్ టీంను పంపిస్తానని కేటీఆర్ భరోసానిచ్చారు.



కామారెడ్డి జిల్లా భిక్కనూరులో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న రైతు

## కడుపు మండి.. ధాన్యానికి నిప్పు

- పంట కొనుగోలు చేయట్లేదని నిరసన
- కామారెడ్డి జిల్లా భిక్కనూరులో ఘటన

భిక్కనూరు, మే 16: ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ ఓ కౌలు రైతు వరి కుప్పకు నిప్పంటించాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూరులో చోటుచేసుకున్నది. రైతు రమేశ్ స్థానిక సిద్ధరామేశ్వర ఆలయ భూములను కౌలుకు చేస్తున్నాడు. ఎకరన్నరలో వరి సాగుచేసి.. పంటను కొనుగోలు కేంద్రానికి తరలించాడు. ధాన్యం ఆరబెట్టినా ఇంకా తూకం వేయడం లేదని ఆవేదన చెంది గురువారం కుప్పకు నిప్పంటించాడు. కేంద్రం నిర్వాహకులు డబ్బులు ఇచ్చిన రైతుల వడ్లను మాత్రమే కాంటా వేస్తున్నారని ఆవేదన చెందాడు. కొన్నిరోజులుగా అకాల వర్షం కురుస్తున్నదని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని నిర్వాహకులతో వాగ్వాదానికి దిగాడు. అధికారులు స్పందించి గురువారం రాత్రి కాంటా చేశారు.

# కాంటాలు ఎందుకు పెడ్తలేరు?



మహబూబాబాద్ జిల్లా తొర్రూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- కొనుగోళ్లలో జాప్యంపై బీఆర్ఎస్ ఆగ్రహం

తొర్రూరు, మే 16 : కొనుగోలు కేంద్రాల్లో జాప్యాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలో ఏర్పాటు చేసిన 19 కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్ల ప్రక్రియ ముగియలేదని వారు మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం వారు తొర్రూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో నిరసనకు దిగారు. రైతులు ఎండలో వడ్ల రాశులకు కాపలా కాస్తూ, వడదెబ్బతో అస్వస్థతకు గురవుతున్నామని తెలిపారు.

### ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పర్యవేక్షించాలి

- కలెక్టర్లకు మంత్రి ఉత్తమ్ ఆదేశం

హైదరాబాద్, మే 16 (నమస్తే తెలంగాణ) : ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను క్షేత్రస్థాయిలో కలెక్టర్లు పర్యవేక్షించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నదని, తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తామని తెలిపారు. మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి, పొన్నం, సీఎస్ రామకృష్ణారావు పాల్గొన్నారు.

### పంట తెగుళ్లను గుర్తించి ఎరువు చల్లే రోబో

హైదరాబాద్, మే 16 (నమస్తేతెలంగాణ): పంట తెగుళ్లను గుర్తించి పురుగు మందులు చల్లే సెమీ ఆటోమెటిక్ ట్రాక్ మొబైల్ మానిప్యులేటర్ రోబోను ఐఐటీ ఖరగ్‌పూర్ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం అభివృద్ధి చేసింది. ప్రొఫెసర్ దిలీప్‌కుమార్ ప్రతిహార్ నేతృత్వంలో విద్యార్థుల బృందం ఈ రోబోను తయారు చేసింది. కెమెరా ఆధారిత ఇమేజ్ అనాలిసిస్ ద్వారా తెగుళ్లను గుర్తిస్తుంది. తగిన ఎరువును ఎంచుకొని చల్లుతుంది.



ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముక్రా(కే)లో ఉపాధి హామీ పనులు చేస్తున్న మాజీ సర్పంచ్ దంపతులు

## ఉపాధి కూలీలుగా 'ఆదర్శ సర్పంచ్' దంపతులు

**ఆదిలాబాద్ జిల్లా ముక్రా(కే)లో ఘటన**

ఇచ్చోడ, మే 16 : కేసీఆర్ హయాంలో పల్లె ప్రగతితో దేశంలోనే ఆదర్శ గ్రామంగా నిలిచిన ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముక్రా(కే) నేడు కాంగ్రెస్ పాలనలో అష్టకష్టాలు పడుతున్నదని మాజీ సర్పంచ్ గాడ్గె మీనాక్షి ఆవేదన వ్యక్తంచేశారు. శుక్రవారం ఉపాధిహామీ కూలీలతో కలిసి పని చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో నెల నెలా గ్రామాలకు నిధులు వచ్చేవని, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో నిధులు లేక గ్రామాలు చెత్త కుప్పలుగా మారాయని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల బిల్లులు రాక సర్పంచ్‌లు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దేశానికి ఆదర్శంగా నిలిచి రాష్ట్రపతి, కేంద్ర మంత్రుల చేతుల మీదుగా ఎన్నో జాతీయ అవార్డులు తీసుకున్నామని గుర్తుచేశారు. ఆర్థిక ఇబ్బందులతో ఉపాధి హామీ పనులకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొన్నదని చెప్పారు. ఇప్పటికైనా పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### కొనుగోళ్లు వేగవంతం చేయాలని రాస్తారోకో

నెలరోజులైనా ధాన్యం కొనుగోళ్లు పూర్తి కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు ధర్నాకు దిగారు. కొనుగోళ్లలో వేగం పెంచాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎం) మండల కేంద్రంలో మోత్కూర్-భువనగిరి ప్రధాన రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. కొనుగోళ్లను వేగవంతం చేయకపోవడం, లారీలు రాకపోవడంతో అకాల వర్షాలకు ధాన్యం తడుస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు.

- ఆత్మకూరు(ఎం)



## పెద్దపల్లి కలెక్టర్ పెద్ద మనసు

**అనాథ యువతి పెళ్లి జరిపించేందుకు ముందుకొచ్చిన కోయ శ్రీహర్ష**

పెద్దపల్లి, మే 16 : పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష పెద్దమనసు చాటుకున్నారు. అనాథ యువతి వివాహం జరిపించేందుకు ముందుకొచ్చారు. తల్లిదండ్రులను కోల్పోయిన మానస (20) తన చెల్లితో కలిసి రామగుండంలోని తబిత బాలల సంరక్షణ కేంద్రంలో పదహారు ఏళ్లుగా ఉంటున్నది. డిగ్రీ పూర్తి చేసి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నది. ఇటీవల డీడబ్ల్యూవో వేణుగోపాల్ ఆధ్వర్యంలో అధికారులు ఆ యువతికి జనగామ జిల్లా రఘునాథపల్లి చెందిన రాజేశ్‌తో పెండ్లి నిశ్చయించారు. ఈ విషయం తెలిసిన కలెక్టర్ పెళ్లి పెద్దగా వ్యవహరించేందుకు ముందుకొచ్చారు. ఈ నెల 21న పెద్దపల్లి కలెక్టరేట్ ప్రాంగణంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో పెళ్లి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తమ వంతుగా సాయం అందించేందుకు ముందుకొచ్చారు.



వివాహ మహోత్సవ ఆహ్వాన శుభపత్రిక

తేది 21-05-2025

చి.ల.సౌ. యన్. మానస

చి. యమ్. రాజేష్

కళ్యాణ వేదిక :

శ్రీ వెంకటేశ్వరస్వామి కళ్యాణ మండపం,

కలెక్టరేట్, పెద్దపల్లి.

విందు : వివాహానంతరం...

మానస పెళ్లికార్డు

# బాసర పూజారిపై దాడి నిజమే!

- స్వామీజీ అనుచరుడి బుకాయింపు
- సీసీ టీవీ పుటేజీలో బట్టబయలు
- స్థానిక వాట్సాప్ గ్రూపుల్లో దాడి వీడియో చక్కర్లు

బాసర, మే 16: బాసర ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్ పూజారిపై దాడి జరిగినట్టు తేలింది. దాడి ఘటన సీసీ టీవీ పుటేజీతో ఆ విషయం బయటపడింది. పూజారిపై నూకం రామారావు దాడికి దిగిన వీడియో పుటేజీ స్థానిక సోషల్ మీడియా గ్రూపుల్లో చక్కర్లు కొట్టింది. ఈ విషయంతో దాడి చేయలేదంటూ నూకం రామారావు బుకాయించాడని తేలిపోయింది. వాస్తవంగా తనపై బుధవారం సాయంత్రం స్థానిక వేద భారతీపీఠం నిర్వాహకుడు వేద విద్యానందగిరి (ఆంధ్ర స్వాములోరి) ప్రధాన అనుచరుడైన నూకం రామారావు తనపై దాడి చేసినట్టు పూజారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. దీనిపై నూకం రామారావు శుక్రవారం బాసరలో మీడియాతో



వేద విద్యానందగిరి స్వామీజీ ప్రధాన అనుచరుడు రామారావు

మాట్లాడారు. తనపై అనవసరమైన ఆరోపణలు చేస్తున్నారని, తాను దాడి చేయలేదంటూ బుకాయించాడు. ఆలయ ప్రధాన అర్చకుడిపై చేయి ఎత్తలేదని, వేద మంత్రాలు పలికే నోటితో పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారంటూ ఆరోపించారు. పూజారితో కేవలం మాటల యుద్ధమే జరిగిందని, ఆ సమయంలో తాను స్కూటర్ కూడా దిగలేదని, సీసీ టీవీ పుటేజీని సైతం మీడియాకు అందజేశారు. అయితే అది పూర్తి వీడియో కాకుండా వీడియోలో కొంత భాగానే మీడియాకు అందజేశారు.

**వాట్సాప్ గ్రూపుల్లో పూర్తి వీడియో షేర్**

బాసరకు చెందిన స్థానికులు సీసీ టీవీ పుటేజీ పూర్తి వీడియోను స్థానిక వాట్సాప్ గ్రూపుల్లో పెద్ద ఎత్తున షేర్ చేశారు. ఈ వీడియోలో నూకం రామారావు స్కూటీ దిగి వెళ్లి పూజారిపై దాడి చేసినట్టు స్పష్టంగా కనిపిస్తున్నది. దీంతో తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారంటూ స్వామీజీ ప్రధాన అనుచరుడు రామారావు చెప్పింది మొత్తం కట్టుకథే అని తేలింది. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దాడి చేసింది కాకుండా చేయలేదంటూ అబద్ధాలు చెప్పడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. పూర్తి సీసీ టీవీ పుటేజీ విడుదల చేయకుండా బుకాయించి, బురిడీ కొట్టించే ప్రయత్నం చేయడంపై మండిపడుతున్నారు.

## కొలువుల దందాపై విజి'లెన్స్'

- కోటికి స్కెచ్‌పై విచారణ
- కార్మిక సంఘం నాయకుల ప్రమేయంపైనా ఆరా?
- ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల నుంచి వివరాల సేకరణ
- నిరుద్యోగుల నుంచి కూపీ
- 'నమస్తే కథనం'తో కదులుతున్న డొంకలు

జయశంకర్ భూపాలపల్లి, మే 16 (నమస్తే తెలంగాణ) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సింగరేణి కాలరీస్ కంపెనీలో ప్రైవేట్ సెక్యూరిటీగార్డుల నియామకాల దందాపై విజిలెన్స్ విచారణ ప్రారంభమైంది. 'కొలువుల దందాలో కోటికి స్కెచ్' అనే శీర్షికతో 'నమస్తే తెలంగాణ' మెయిన్‌లో గురువారం కథనం ప్రచురితం కాగా భూపాలపల్లి ఏరియా సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి విచారణ జరిపారు. భూపాలపల్లి ఏరియాలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు ఎంతమంది పని చేస్తున్నారు, భూనిర్వాసితులు, నాన్‌లోకల్ వాళ్లు, అర్హులు, అనర్హులు ఎంత మంది ఉన్నారనే విషయమై ఆరా తీసినట్టు తెలిసింది. సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు ఉద్యోగాల కోసం 30 మంది నుంచి రూ.3లక్షల చొప్పున వసూలు చేసి కోటికి స్కెచ్ వేసింది, ఉద్యోగాల కోసం డబ్బులు ఇచ్చింది, దందాలో కీలకపాత్ర పోషిస్తున్నది ఎవరు? అనే కోణంలో విజిలెన్స్ అధికారులు విచారణ జరుపుతున్నట్టు తెలిసింది. భూపాలపల్లి ఏరియాలో పని చేస్తున్న ముగ్గురు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు, డబ్బులు ఇచ్చిన ఇద్దరు నిరుద్యోగులతో మాట్లాడినట్టు తెలిసింది. ప్రైవేట్ సెక్యూరిటీ టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ఈ దందాలో కీలక పాత్ర పోషించినట్టు విచారణలో గుర్తించినట్టు సమాచారం. మంత్రులు, ఎంపీలు, సింగరేణి ఉన్నతాధికారులు, ఉన్నతస్థాయి కార్మిక నేతల పైరవీలపైనా కూపీ లాగినట్టు స్థానికంగా ప్రచారం. ఇటీవల డబ్బులు ఇచ్చిన ఒక నిరుద్యోగి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి డబ్బులను తిరిగి వసూలు చేసుకున్నట్టు తెలిసింది.